వేడుకగా గ్రామ తీర్థాలు

ఆకట్టుకున్న జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందెం



మాడుగుల రూరల్: కె.జె.పురం గాంధీ వీధిలో గాంధీ విగ్రహం

మాడుగుల: కింతలి వల్లాపురంలో జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు ప్రదర్శనలు హుషారుగా సాగాయి. సోమవారం ఇక్కడ ఆరేళ్లమ్మతల్లి తీర్థం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జిల్లా నలుమూలల నుంచి 12 జతల గిత్తలు పాల్గొనగా, ఆరు జతలను ఎంపిక చేసి బహుమతులు ప్రదానం చేశారు. అంతకు ముందు ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అదేవిధంగా నేల వేషాలు, తప్పెడ గుళ్లు, కోలాటాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమం సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి రాంబాబు, ఉప సర్పంచ్ గోవింద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ తల్లి తీర్థ మహోత్సవం

దేవరాపల్లి: మారేపల్లి పంచాయతీ శివారు శివరామ చేనులపాలెం ప్రజల ఆరాధ్య దైవం బంగారమ్మ తల్లి తీర్థ మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామస్తులు సైతం తెల్లవారు నుంచి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహిళల కోలాట ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరద పురెడ్డి సింహాచలంనాయుడు, రాష్ట్ర మహిళా విభాగం సంయుక్త కార్యదర్శి రొంగలి నారాయణమ్మ, జేసీఎస్ మండల కన్వీనర్ కేవీ రమణ, ఉప సర్పంచ్ రొంగలి కన్నంనాయుడు పాల్గొన్నారు.



మేడిచర్లలో అభయాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

కె.కోటపాడు: మేడిచర్లలో అభయాంజనేయ స్వామి ఆలయ 17వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమాది కార్యక్రమాలతోపాటు కుంకుమ పూజలకు పెద్ద ఎత్తున మహిళలు హాజరయ్యారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కిల్లి జగన్నాథం, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆదిరెడ్డి వెంకటరావు, రైవాడ ప్రాజెక్టు మాజీ చైర్మన్ బొడ్డు తాతయ్యబాబు, దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం, బొడ్డు వెంకటరావు, ఆదిరెడ్డి మురళీ, బొడ్డు కృష్ణారావు, లెక్కల కోటేశ్వరరావు, ఆర్పీ నాయుడు, వేచలపు చినబాబు, వెంకటరావు, నరసింహం పాల్గొన్నారు.



మాడుగుల: ఎడ్ల బళ్ల పందెంలో పరుగు తీస్తున్న గిత్తలు

రేపు కె.జె.పురంలో జాతిపిత మహాత్మా గాంధీ తీర్థం

మాడుగుల రూరల్: జాతి పిత మహాత్మాగాంధీ తీర్థం ఈ నెల 31న కె.జె.పురంలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దాడి రాము సోమవారం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీ వీధిలో గాంధీ విగ్రహం వద్ద ఏటా గాంధీ వర్ధంతి మరుసటి రోజు తీర్థం నిర్వహించడం ఆనవాయితీ. ఆ రోజు ఉదయం 9 గంటలకు బాలబాలికలతో దేశభక్తి గీతాలాపనతో పాటు పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పిస్తారన్నారు. సాయంత్రం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.1016, రూ.516, రూ.316 చొప్పున ప్రదానం చేస్తామన్నారు. జూనియర్ సైకిల్ స్పీడు పోటీలు విజేతలకు బహుమతులు అందజేస్తామని, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ధర్మసాగరం జట్టు



జిల్లా స్థాయికి ఎంపికైన కబడ్డీ జట్టుతో సర్పంచ్ కన్నయ్యనాయుడు

నర్సీపట్నం: నియోజకవర్గ స్థాయి పోటీల్లో నర్సీపట్నం మండలం ధర్మసాగరం జట్టు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఆడుదాం.. ఆంధ్రాలో భాగంగా నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పోటీలు రసవత్తరంగా సాగాయి. నాలుగు మండలాల నుంచి నాలుగు మహిళా జట్లు తలపడ్డాయి. వీటిలో ధర్మసాగరం మహిళా జట్టు అద్భుతమైన ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి అర్హత సాధించింది. కబడ్డీ జట్టును గ్రామ సర్పంచ్ గొంప కన్నయ్యనాయుడు అభినందించారు. జిల్లా స్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో ధర్మసాగరానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చీడికాడ: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జయప్రకాష్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ సమావేశం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కానుందని, ప్రజా ప్రతినిధులు, అధికారులు విధిగా హాజరు కావాలని సూచించారు.

క్లుప్తంగా

వైఎస్సార్ బీమా నగదు అందజేత



పైడిరాజుకు నగదు అందిస్తున్న ఎంపీటీసీ రామునాయుడు

కె.కోటపాడు: సహజంగా, ప్రమాదవశాత్తూ మరణించిన కుటుంబాలకు వైఎస్సార్ బీమా ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఎంపీటీసీ వర్రి రామునాయుడు అన్నారు. ఈ నెల 26న పల్లా అప్పలనాయుడు మృతితో బాధిత కుటుంబ సభ్యులకు సోమవారం సూదివలసలో తక్షణ సాయంగా రూ.10 వేలు అందజేశారు. నామినీగా ఉన్న మృతుని సోదరుడు పైడిరాజు బ్యాంకు ఖాతాలో మిగిలిన రూ.90 వేలు జమ కానున్నట్లు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రేవతి తెలిపారు.

గ్రామాల్లో సామాజిక తనిఖీలు

మాడుగుల రూరల్: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీలు గ్రామాల్లో ఈ నెల 24వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్టు ఏపీవో నవర వరహాలబాబు సోమవారం పేర్కొన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులకు సంబంధించి 29 గ్రామ పంచాయతీల్లో ఏడుగురు జిల్లా రిసోర్సు పర్సన్లు, ఒక స్టేట్ రిసోర్సు పర్సన్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు తనిఖీలు చేస్తామన్నారు. రూ.9 కోట్లతో పనులు చేపట్టామని, వీటికి సంబంధించి రూ.7 కోట్లు వేతనదారులకు వేతనాలుగా చెల్లించామని తెలిపారు.

రీసర్వేలో అభ్యంతరాల స్వీకరణ నేడు

రావికమతం: కొత్తకోటలో రీసర్వేపై రైతులకు అభ్యంతరాలుంటే మంగళవారంలోగా స్థానిక వీఆర్వో కార్యాలయంలో తెలియజేయాలని ఆర్ఐ సతీష్ సోమవారం తెలిపారు. పొరపాట్లు ఉన్నట్లయితే సంబంధిత పత్రాలను చూపాలన్నారు.

169 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి నిర్మల

కె.కోటపాడు: ఫ్యామిలీ డాక్టరుతో గ్రామాల్లోనే మెరుగైన వైద్యం అందుతున్నట్లు చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల అన్నారు. సోమవారం గొండుపాలెంలో 169 మందికి ఓపీ వైద్య సేవలందించారు. అచేతన రోగుల ఇళ్లకు వెళ్లి ఐదుగురిని పరీక్షించి మందులను ఇచ్చా రు. వీరితోపాటు గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డీఎస్ఎన్ రాజు, రమణ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆసక్తిగా 'పరీక్షా పే చర్చ'



మోదీ ప్రసంగాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

మాకవరపాలెం: పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా లక్ష్యాలను ఛేదించడంపై ప్రధాని నరేంద్రమోదీ పరీక్షా పే చర్చ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమాన్ని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు స్మార్ట్ టీవీ ద్వారా తిలకించారు. కార్యక్రమంలో హెచ్ఎం కోసూరు రాము, ఉపాధ్యాయులు లోవరాజు, నారాయణరావు, సంతోషి పాల్గొన్నారు.

పశుపోషణపై అవగాహన తప్పనిసరి



పశువులకు గర్భకోశ చికిత్సలు అందిస్తున్న సిబ్బంది

చీడికాడ: పశుపోషణపై రైతులు అవగాహన కలిగి ఉండాలని పెదగోగాడ పశువైద్యురాలు రాఘవమ్మ తెలిపారు. సోమవారం చీడిపల్లి శివారు వెల్లంకిలో పశువిజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 25 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు చేశారు. 20 పెయ్యిలకు నట్టల నివారణ మందులు అందించారు. ప్రతి రైతు పశుపోషణపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రభుత్వం అందుకు అవసరమైన సదస్సులు నిర్వహిస్తుందన్నారు.

పాఠశాలలో ప్రమాదకరంగా విద్యుత్తు తీగలు



విద్యుత్తు తీగలను చూపుతున్న నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు

బుచ్చెయ్యపేట: విజయరామరాజుపేట జెడ్పీ హైస్కూల్‌లో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను మార్పు చేయాలని గ్రామ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇక్కడ 600 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల భవనంతోపాటు మైదానంలో విద్యుత్తు తీగలు ప్రమాద భరితంగా ఉన్నాయి. నేలకు ఎనిమిదడుగుల ఎత్తులో వేలాడుతూ ఉండటంతో గ్రౌండ్‌లో వాలీబాల్, షటిల్, క్రికెట్ తదితర ఆటలాడుతున్న విద్యార్థులు భయందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఏ మాత్రం గాలి వీచినా నిప్పు రవ్వలు రాజుకుంటున్నాయని వాపోతున్నారు. వెంటనే తీగలు మార్పు చేయాలని స్థానిక నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచ్ ఎల్లపు విజయ్‌కుమార్, కోఆపరేటివ్ అధ్యక్షుడు ఎల్లపు గోవింద, వైస్ సర్పంచ్ జగ్గ సోమవారం పరిశీలించారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

నర్సీపట్నం: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారం చేపట్టక మునుపు ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. గత ప్రభుత్వాలు పరిశ్రమలు స్థాపించి ఉపాధి కలిస్తే.. వాటిని ప్రైవేటీకరణ చేసి కార్మికుల పొట్ట కొడుతుందన్నారు.రాజకీయ ప్రయోజనం కోసం బీజేపీతో టీడీపీ రాజీపడుతుందని విమర్శించారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు ఎ.రాజు, చిరంజీవి, సూర్యప్రభ, గౌరీ, సాపిరెడ్డి నారాయణమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు తుది గడువు నేడు

రోలుగుంట: ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు టెన్త్‌కు రోలుగుంట, ఇంటర్‌కు కొమరవోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలు కేంద్రాలుగా మంజూరయ్యాయి. 15 ఏళ్లు నిండిన వారు పదో తరగతి, 17 ఏళ్లు నిండిన వారు ఇంటర్ ప్రవేశ పరీక్షలకు అర్హులని, మంగళవారంలోగా అపరాధ రుసుం లేకుండా దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయా పాఠశాలల హెచ్ఎంలు ప్రసాదరావు, వెంకటరావు తెలిపారు. ఆన్‌లైన్‌లో గాని, ఆఫ్‌లైనులో గాని దరఖాస్తు చేసుకోవచ్చని ఎంఈవో –2 జగ్గారావు తెలిపారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

మాడుగుల రూరల్: వీరనారాయణంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నట్టు కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.వి.ఎస్. ప్రసాదుపాత్రుడు సోమవారం తెలిపారు. ఈ శిబిరంలో రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేస్తామన్నారు.

పిచ్చుకల పరిరక్షణకు కృషి

హరిత వికాస్ ఫౌండేషన్ నిర్వాహకుడు దాలినాయుడు

నాతవరం: పిచ్చుకల పరిరక్షణకు అందరు మానవతా దృక్పథంతో కృషి చేయాలని హరిత వికాస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు పోలుపర్తి దాలినాయుడు కోరారు. మండలంలో ఎం.బి.పట్నం, గన్నవరం, మన్యపురట్ల, నాతవరం గ్రామ రామాలయాల్లో సోమవారం ఆయన పిచ్చుకలకు ఆహారంగా ధాన్యపు కుంచెలు వేలాడదీశారు. రామాలయాల వద్ద పాఠశాలల్లో పిచ్చుకలను ఏ విధంగా పరిరక్షించాలన్న అంశాలను గ్రామపెద్దలకు విద్యార్థులకు అవగాహన కల్పించారు. తాను ఏటా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా నర్సీపట్నం రెవెన్యూ డివిజన్‌లో అన్ని రామాలయాల్లో ధాన్యపు కుంచెలు వేలాదీస్తున్నానన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



ఎం.బి.పట్నం రామాలయంలో ధాన్యపు కుంచెలు ఏర్పాటు చేస్తున్న దాలినాయుడు

విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్య సాధన

కె.కోటపాడు: విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చదువుల్లో రాణించాలని యువజన సర్వీసుల శాఖ మేనేజర్ బి.సూర్యప్రకాషరావు తెలిపారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, అయ్యన్న జూనియర్ కళాశాల, హైస్కూల్ విద్యార్థులకు యువతకు కెరీర్ గైడెన్స్, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్యను అందుకుంటున్న విద్యార్థులు జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ వంటి అంశాలపై పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీయర్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌వీ సన్యాసిరావు, రిసోర్స్ పర్సన్ ఎస్ఏబాబు, ప్రభుత్వ జూనియర్, అయ్యన్న కళాశాల ప్రిన్సిపాళ్లు సుధాకర్‌బాబు, డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్, హెచ్ఎం పద్మావతి పాల్గొన్నారు.



కెరీర్ గైడెన్స్‌కు సంబంధించిన పుస్తకాలను అందిస్తున్న సూర్యప్రకాషరావు, తదితరులు

ఇన్‌చార్జి ఎంపీడీవోకు ఘన సత్కారం

మాడుగుల: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఇన్‌చార్జి ఎంపీడీవో మీనాకుమారిని పంచాయతీ కార్యదర్శులు, సూపరింటెండెంట్ గోపాల్‌తోపాటు సిబ్బంది దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈమె విధి నిర్వహణలో సేవలను గుర్తించి గణతంత్ర దినోత్సవం రోజున అనకాపల్లిలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మీనాకుమారి మాట్లాడారు ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించిన వారికి తప్పకుండా ఏదో ఒక రోజు మంచి గుర్తింపు వస్తుందన్నారు.



ఇన్‌చార్జి ఎంపీడీవోను సత్కరిస్తున్న సిబ్బంది

భవనం మరమ్మతులకు ప్రతిపాదన



భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు

రోలుగుంట: స్థానిక ఎంపీడీవో కార్యాలయ భవనం పలు చోట్ల దెబ్బతింది. దీంతో వర్షాకాలంలో కారుతోంది. ఉద్యోగులు విధుల నిర్వహణకు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావుకు విన్నవించారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే అక్కడ దెబ్బతిన్న గదులు, భవనం లోపల, బయట గోడలు, కిటికీలు సోమవారం పరిశీలించారు. భవనం మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన చేయాలని సూచించారు.

గాలిగోపురానికి రాతి ద్వారబంధం



పూజలు చేస్తున్న సర్పంచ్ సంజీవిరావు

మాడుగుల రూరల్: ఎం. కోడూరు మోదకొండమ్మ ఆలయంలో గాలిగోపురానికి నల్లరాతి ద్వారబంధం ఏర్పాటు చేశారు. సోమవారం ఇక్కడ గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు సారథ్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన వాసవీ క్లబ్ సభ్యులు కర్రి రమణ, జల్లి హరిప్రసాదు, వానపల్లి వేణు, అప్పాన కోటేశ్వరరావు, దొగ్గ శివప్రసాదు ఆర్థిక సాయంతో రాజమహేంద్రవరం నుంచి దీన్ని తయారు చేసి తెప్పించామని సర్పంచ్ తెలిపారు. వచ్చే నెల నాలుగో తేదీన అమ్మవారి తీర్థం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శికి సత్కారం



బాబూరావును సత్కరిస్తున్న ఎంపీటీసీ, తదితరులు

మాకవరపాలెం: ఉత్తమ అవార్డు అందుకున్న పంచాయతీ కార్యదర్శికి ఘన సత్కారం చేశారు. మండలంలోని తూటిపాల కార్యదర్శి మాకిరెడ్డి బాబూరావుకు రిపబ్లిక్ డే రోజున ఉత్తమ ఉద్యోగిగా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ప్రశంసాపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో సోమవారం తూటిపాల గ్రామ సచివాలయంలో కార్యదర్శిని ఎంపీటీసీ సభ్యురాలు రుత్తల సత్యవతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజు సత్కరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెరకు తరలించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న ముత్యాలనాయుడు, రైతులు

కె.కోటపాడు: సూర్రెడ్డిపాలెం చెరకు (కాటా) నుంచి గోవాడ చక్కెర కర్మాగారానికి వెంటనే చెరకు తరలించాలని సీపీఎం నాయకుడు రొంగలి ముత్యాలనాయుడు డిమాండ్ చేశారు. ఇక్కడ కాటా వద్ద చెరకు రైతులతో కలిసి సోమవారం ఆయన ఆందోళన చేపట్టారు. కాటాల వద్దకు రైతులు తీసుకొచ్చిన చెరకును తరలించక పోవడంతో బరువు తగ్గి రైతులు నష్టపోతున్నారని వాపోయారు. ఫ్యాక్టరీ యాజమాన్యం కాటాల వద్ద నుంచి చెరకును తరలించేందుకు అవసరమైన లారీల సంఖ్యను పెంచాలని కోరారు. కార్యక్రమంలో రైతులు వనుము సూర్యనారాయణ, సత్యం, బొడ్డు రామునాయుడు, రొంగలి తాతబాబు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: స్పందన అర్జీలను నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం అధికారులను ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన)లో ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. వీటిలో ఎక్కువగా భూసమస్యలు, చేయూత, ఇళ్ల స్థలాలకు సంబంధించిన సమస్యలు ఉన్నాయన్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

నేడు నూతన భవనాల ప్రారంభోత్సవాలు

5 పంచాయతీల్లో రూ.3 కోట్లతో నిర్మాణం

నాతవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీలను రాజకీయాలకు అతీతంగా 98 శాతం నెరవేర్చారని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నా రు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వైస్ ఎంపీపీ పైల సునీల్, పార్టీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావులతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ నెల 30న పెదగొలుగొండపేట, మన్యపురట్ల, మర్రిపాలెం, గుమ్మడిగొండ, ఎం.బి.పట్నం పంచాయతీల్లో రూ.3 కోట్లతో నూతనంగా నిర్మించిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ సెంటర్ల భవనాలకు ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ప్రారంభోత్సవాలు చేస్తారన్నారు. నూతన భవనాలతోపాటు పలు అభివృద్ధి పనులు ప్రారంభోత్సవాలు ఉంటాయన్నారు. నాతవరం పంచాయతీలో నూతనంగా నిర్మించిన భవనాలకు ఎమ్మెల్యే డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, అమర్‌నాథ్ లతో గతంలో ప్రారంభోత్సవాలు చేశారని గుర్తు చేశారన్నారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా నిర్మాణాలు పూర్తి చేసిన భవనాలు ప్రారంభించి వాటిలో ప్రభుత్వ సేవలు ప్రజలకు అందిస్తారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సచివాలయం ఒక్కంటికి రూ.20 లక్షల చొప్పున మంజూరు చేసిన పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ అడిగర్ల నాయుడు, పి.కె.గూడెం ఎంపీటీసీ సభ్యుడు గాడి రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీ పైల సునీల్, పార్టీ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు

రూ.27 కోట్లతో జల జీవన్ మిషన్ పనులు

ఎంపీడీవో హనుమంతరావు

నాతవరం: మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.27 కోట్లతో 97 పనులు చేస్తున్నామని ఎంపీడీవో హను మంతరావు అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో సోమ వారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 41 గ్రామ జల సంఘాలు ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో జల సంఘంలో 9 మంది డ్వాక్రా మహిళలు, సచివాలయ టెక్నికల్ అసిస్టెంటు, పంచాయతీ కార్యదర్శి మొత్తం 11 మంది సభ్యులు ఉంటారన్నారు. జల్ జీవన్ మిషన్ నిధులతో తాగునీటి ట్యాంకుల నిర్మాణం, ఇతర పెద్ద పనులు కాకుండా ఇంటింటా కుళాయిల ఏర్పాటు, నీటి సంరక్షణ పనులతో పాటు పర్యవేక్షణ ఇతర పనులు కమిటీలతో చేయించాలన్నారు. క్షేత్రస్థాయిలో నీటి వినియోగం, ఇంటింటా కుళాయిలు ఏర్పాటుపై మహిళలు బాధ్యతగా ఉంటుదన్న భావనతో ప్రభుత్వం కమిటీ సభ్యులుగా వీరిని నియమించిందన్నారు. వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేశామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రాజేష్ తెలిపారు. ఇంతవరకు జల్ జీవన్ మిషన్ పథకంలో రూ.19 కోట్లపైగా పనులు చేశామని, మిగతావి మార్చిలోగా పూర్తి చేసేందుకు దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ జేఈ జోగారావు, పంచాయతీ విస్తరణాధికారి ఎస్.వి. మూర్తి, మండల మహిళా సమాఖ్య మండల శాఖ అధ్యక్షురాలు పోలుపర్తి రాధ, పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ వర్కు ఇన్‌స్పెక్టరు ఎస్. రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో హనుమంతరావు

జల సంఘాల ఆధ్వర్యంలో పైపులైన్ పనులు

మాకవరపాలెం: జల సంఘాల ఆధ్వర్యంలో తాగునీటి పైపులైన్ పనులను నిర్వహిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో సీతామహాలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలో నూతనంగా చేయాల్సిన 30 పనుల నిర్వహణకు నియమించిన జల సంఘాలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివారెడ్డి మాట్లాడుతూ మండలంలో జల్‌జీవన్ మిషన్ పథకంలో 30 పనులు చేయాల్సి ఉందన్నారు. వీటిని నూతనంగా 11 మందితో నియమించిన జలసంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ సంఘంలో పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, తొమ్మిది మంది డ్వాక్రా సంఘ సభ్యులు ఉంటారన్నారు.